

అడవిలో ఆర్తనాదాలు..!

అటవీశాఖ అధికారుల తీరుతో శ్రీశైలం యాత్రికులకు తాగునీటి కష్టాలు తప్పడం లేదు. ప్లాస్టిక్ ఫ్రీ జోన్‌పై అవగాహన కల్పించకుండానే వాటర్ బాటిళ్ల స్వాధీనంపై విమర్శిస్తున్నారు. - 8లో..



ఘాట్ రోడ్డులో ప్రమాదం

శ్రీశైలం ఘాట్ రోడ్డులో కారు అదుపుతప్పి లోయలోకి దూసుకెళ్లింది. కర్నూలు జిల్లా ప్యాలకుర్తికి చెందిన 15 మందికి తీవ్రగాయాలయ్యాయి. - 8లో..

గరిష్టం/కనిష్టం 38/28

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

నేటి నుంచి ఉపాధ్యాయులకు శిక్షణ తరగతులు

ఒంగోలు: రాష్ట్రంలో సీబీఎస్‌ఈ పాఠశాలలుగా ఎంపికైన 63 ప్రభుత్వ పాఠశాలల్లో 9, 10 తరగతులు బోధిస్తున్న ఉపాధ్యాయులకు ఈ నెల 17 నుంచి 21వ తేదీ వరకు శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి డి.సుభద్ర గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర పరిశీలకులైన ఆర్.ప్రసన్నకుమార్ ఆధ్వర్యంలో ముండ్లమూరు ఏపీ మోడల్ స్కూల్లో ఈ శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామన్నారు. స్ట్రక్చర్డ్ పెడగాగీ లెసన్ ప్లాన్స్ 2024-25 అకడమిక్ ఇయర్ శిక్షణ (నాన్ రెసిడెన్షియల్) నిర్వహించేందుకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించామన్నారు. ఇంగ్లిష్, సోషల్, బయోలాజికల్ సైన్స్ ఉపాధ్యాయులకు ఈ నెల 17, 18 తేదీల్లో ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు తరగతులు ఉంటాయన్నారు. గణితం, ఫిజిక్స్, కెమిస్ట్రీ ఉపాధ్యాయులకు ఈ నెల 20, 21 తేదీల్లో ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు శిక్షణ ఉంటుందన్నారు. సబ్జెక్టుల వారీగా ఆంగ్లం 97, సోషల్ 89, బయోలాజికల్ సైన్స్ 116, గణితం 128, ఫిజిక్స్ 58, కెమిస్ట్రీ 58 మంది వెరసి 546 మంది ఉపాధ్యాయులకు శిక్షణ ఇస్తున్నట్లు పేర్కొన్నారు. శిక్షణకు ఎంపికైన ఉపాధ్యాయులు తప్పనిసరిగా శిక్షణకు హాజరయ్యేలా సంబంధిత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ప్రిన్సిపాళ్ల చర్యలు చేపట్టాలని సూచించారు.

108 కలశాలతో శోభాయాత్ర

- వాసవీ కన్యకాపరమేశ్వరి జయంతి వేడుకలు ప్రారంభం



అభిషేక జలాన్ని శోభాయాత్రగా తీసుకొస్తున్న మహిళలు

ఒంగోలు మెట్రో: వాసవీ కన్యకాపరమేశ్వరీదేవి జయంతి వేడుకలు స్థానిక గాంధీరోడ్డులోని వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి వీధిలోని వాసవీ కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో ఆలయ తదియారాధన సంఘం ఆధ్వర్యంలో గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉదయం ఏడు గంటలకు స్థానిక రంగారాయుని చెరువు నుంచి 108 కలశాలతో నగరంలోని ఆర్యవైశ్య మహిళలు అభిషేక జలాన్ని శోభాయాత్రగా తీసుకొచ్చి అమ్మవారికి అభిషేకం చేశారు. డాక్టర్ చావల ప్రకాష్ వాసవీ పతాకను ఆవిష్కరించారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక అలంకరణ, పూజా కార్యక్రమాలు నిర్వహించారు. వాసవీ ఆలయ తదియారాధన సంఘ సభ్యులు పాల్గొన్నారు.

వాలీబాల్ శిక్షణకు ఎంపికలు

ఒంగోలు సెంట్రల్: ప్రకాశం జిల్లా వాలీబాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బాలబాలికలకు ఉచితంగా వేసవి రెసిడెన్షియల్ శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆ సంఘ అధ్యక్ష, కార్యదర్శులు సూదనగుంట కోటేశ్వరరావు (బుజ్జి), ఎం.ఆంజనేయులు తెలిపారు. బాలబాలికల ఎంపికను శనివారం స్థానిక డీఆర్‌ఆర్‌ఎం ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహించనున్నట్లు చెప్పారు. ఉమ్మడి ప్రకాశం జిల్లాకు చెందిన 13 నుంచి 16 సంవత్సరాల వయసు గల బాలబాలికలు అర్హులని తెలిపారు. బాలురు 178 సెం.మీ, బాలికలు 168 సెం.మీ ఆపైన ఎత్తు కలిగిన వారికి ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు వెల్లడించారు. పూర్తి వివరాలకు 94901 96274, 94903 82802, 77290 61966 నంబర్లను సంప్రదించాలని కోరారు.

వణ్యప్రాణులకు.. అమృత ధారలు

వణ్యప్రాణుల భూతల స్వర్గం నల్లమల. అరుదైన, వైవిధ్యభరితమైన జంతువులకు కేరాఫ్ అడ్రస్. జీవ వైవిధ్యానికి నిలయంగా ఉన్న ఇక్కడ వణ్యప్రాణుల సంరక్షణకు అటవీశాఖ అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. ముఖ్యంగా వేసవిలో దాహార్తి తీర్చేందుకు దృష్టి సారించారు. మండుతున్న ఎండలతో అటవీ ప్రాంతంలో ఉంచే నీటి చలమలు, నీటి మడుగుల్లో జలాలు అడుగంటిపోతున్నాయి. దీంతో వణ్యప్రాణులు నీటి కోసం జనావాసాలవైపు పరుగులు తీస్తున్నాయి. కొన్ని సందర్భాల్లో ప్రమాదాలకు గురవుతున్నాయి. వీటన్నింటినీ దృష్టిలో ఉంచుకుని నీటి కోసం 175 సాసర్‌పిట్లను అధికారులు ఏర్పాటు చేశారు.

- మండుతున్న ఎండలతో అడుగంటుతున్న నీటి వనరులు
- నీటిని అందుబాటులోకి తెచ్చేందుకు ప్రత్యేక చర్యలు
- 175 సాసర్‌పిట్ల ఏర్పాటు
- 40 కుంటల్లో ప్రత్యేకంగా నీటి సౌకర్యం
- 20 సోలార్ పంప్‌సెట్లు ఏర్పాటు



నల్లమలలోని సాసర్‌పిట్‌లో ట్యాంకర్ ద్వారా నీరు నింపుతున్న సిబ్బంది

మార్కాపురం: ప్రకాశం, గుంటూరు, కర్నూలు, తెలంగాణ రాష్ట్రంలోని మహబూబ్‌నగర్ జిల్లాల్లో సుమారు 10 లక్షల ఎకరాల్లో నల్లమల అటవీ ప్రాంతం విస్తరించి ఉంది. జిల్లాలో మార్కాపురం పరిధిలో 900 చదరపు మీటర్ల విస్తీర్ణం ఉంది. దాదాపు 84 పెద్ద పులులతో పాటు 400కుపైగా చిరుతలు, జింకలు, దుప్పులు, నెమళ్లు తదితర వణ్యప్రాణులకు వేసవిలో నీటి ఎద్దడి లేకుండా అటవీశాఖ అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. మార్కాపురం అటవీశాఖ డిప్యూటీ డైరెక్టర్ పరిధిలో మార్కాపురం, యర్రగొండపాలెం, గంజివారిపల్లె, గుంటూరు జిల్లాలోని విజయపురిసౌత్ రేంజ్‌లు ఉండగా, గిద్దలూరు పరిధిలో గిద్దలూరు, గుండ్లకమ్మ, తురిమెళ్ల, కనిగిరి, ఒంగోలు ఉన్నాయి. మూడు వారాలుగా నల్లమల పరిసర ప్రాంతాల్లో ఎండలు మండిపోతున్నాయి. 48 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. మనుషులే ఎండవేడికి ఇబ్బంది పడుతున్న పరిస్థితుల్లో నోరులేని వణ్యప్రాణుల పరిస్థితి ఊహించలేము. అటవీ ప్రాంతంలో నీటి లభ్యత కూడా కరువైంది. దీంతో తాగునీటి కోసం దోర్నాల–శ్రీశైలం, దోర్నాల–ఆత్మకూరు రహదారిపైకి, గ్రామాల వైపు వణ్యప్రాణులు వెళ్తున్నాయి. తిరిగి అవి అరణ్యంలోకి వెళ్లలేకపోతున్నాయి. వేటగాళ్ల ఉచ్చులకు బలవుతున్నాయి. ఇవి అటవీ ప్రాంతాన్ని వదిలిరాకుండా ఉండేందుకు అధికారులు ప్రత్యేక ప్రణాళికతో చర్యలు తీసుకుంటున్నారు. నీటి వనరుల కోసం ఏటా లక్షలాది రూపాయలు ఖర్చు చేస్తున్నారు. అటవీ ప్రాంతంలో 175 సాసర్‌పిట్లు ఏర్పాటు చేసి ప్రతి రెండు రోజులకు ఒకసారి ట్యాంకర్ల ద్వారా నీటితో నింపుతున్నారు. వీటితో పాటు సహజసిద్ధంగా 275 నుంచి 300 నీటి కుంటలు ఉన్నాయి. వీటికి అదనంగా 40 నీటి కుంటలు ఏర్పాటు చేశారు. 20 సోలార్ పంప్‌సెట్ల ద్వారా నీటితో నింపుతున్నారు. దీంతో పెద్ద పులులు, చిరుతలు, దుప్పులు ఇతర వన్యప్రాణులు అక్కడికి వచ్చి నీళ్లు తాగుతున్నాయి. దీని వలన రోడ్లపైకి వచ్చి ప్రమాదాలకు గురికాకుండా ఉన్నాయి. సీసీ కెమెరాల ద్వారా వీటి కదలికలను పరిశీలిస్తున్నారు.

బేస్ క్యాంపులు ఏర్పాటు...

నల్లమల అటవీ ప్రాంతంలో వణ్యప్రాణుల కదలికలు తెలుసుకునేందుకు బేస్ క్యాంప్‌లు ఏర్పాటు చేశారు. ప్రధానంగా పెద్దపులుల సంరక్షణపై ప్రత్యేక దృష్టి సారించారు. వాటి కదలికల కోసం సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. గంజివారిపల్లె సమీపంలోని పెద్దన్న బేస్ క్యాంప్, ఇష్టకామేశ్వరీ, దొరబైలు, నారుతడికల, పాలుట్ల, కొలుకుల, తుమ్మలబైలు, వెదురుపడియ, కొర్రపోలు, చిన మంతనాల, రోళ్లపెంట తదితర ప్రాంతాల్లో బేస్ క్యాంప్‌లు ఉన్నాయి. ఇందులో ఐదుగురు అటవీ అధికారులు ఉంటారు. అడవిలోకి ఎవరూ వెళ్లకుండా ఉండేందుకు కొర్రపోలు, శిరిగిరిపాడు, దోర్నాల గణపతి గుడి వద్ద ఫారెస్ట్ చెక్‌పోస్టులు ఏర్పాటు చేశారు. మొత్తం మీద 120 మంది ప్రొటెక్షన్ వాచర్లు పులుల సంరక్షణలో ఉన్నారు. రాత్రి సమయంలో అడవి జంతువులు వచ్చి దాహం తీర్చుకుంటాయి. నల్లమల అటవీ ప్రాంతంలో సహజ కుంటల్లో వేసవిలో కూడా ఇక్కడ నీరు ఉండటం విశేషం. దీంతో అడవి జంతువులు ఇక్కడికి వచ్చి సేదతీరుతుంటాయి.



నీరు తాగేందుకు వచ్చిన ఎలుగుబంటి



నీటికుంట వద్ద నెమళ్లు



నల్లమలలో నీటిని తాగుతున్న జింకలు

ప్రత్యేక రక్షణ చర్యలు



నల్లమల అటవీ ప్రాంతంలో పులుల సంరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. వేసవిలో వణ్యప్రాణులు నీటి కోసం జనావాసాల్లోకి రాకుండా ఉండేందుకు 175 సాసర్‌పిట్లు ఏర్పాటు చేసి నీరు అందిస్తున్నాం. వణ్యప్రాణుల సంరక్షణకు అన్ని రకాల చర్యలు తీసుకున్నాం. జంతువులను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉంది. ఎత్తైన అరుదైన వృక్షాలు, జంతువులు నల్లమలలో ఉన్నాయి. వేసవిలో జంతువులకు తాగునీటి సమస్య తలెత్తకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశాం. అగ్ని ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకున్నాం. ఘాట్ రోడ్డులో ఎవరైనా వాహనాలు ఆపి బీడీ, సిగరెట్ తాగితే వెయ్యి రూపాయలు జరిమానా విధిస్తున్నాం.

– విఘ్నేష్ అప్పావు, డీడీ, మార్కాపురం

చెప్పాడంటే.. చేస్తాడంతే..!

- ఎన్నికల అనంతరం సైతం ప్రజా సంక్షేమంపైనే సీఎం జగన్ దృష్టి
- జగనన్న విద్యా దీవెన నిధులు విడుదల
- 2023–24 విద్యా సంవత్సరం మొదటి విడత నిధులు విడుదల చేసిన రాష్ట్ర ప్రభుత్వం
- జిల్లాలో 42,797 మంది విద్యార్థుల తల్లుల ఖాతాలకు రూ.36.44 కోట్లు జమ
- ఎన్నికలకు ముందే జమకావాల్సి ఉండగా, ఈసీకి ఫిర్యాదు చేసి అడ్డుకున్న టీడీపీ కూటమి
- పోలింగ్ పూర్తయిన వెంటనే నిధులు విడుదల చేసిన సీఎం జగన్



ఒంగోలు సెంట్రల్: జగనన్న విద్యాదీవెన పథకం 2023–24 విద్యా సంవత్సరం మొదటి విడత నిధులు గురువారం విద్యార్థుల తల్లుల ఖాతాల్లో జమయ్యాయి. ఎన్నికలకు ముందే ఈ నిధులు తల్లుల ఖాతాల్లో జమకావాల్సి ఉంది. ఆ మేరకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చర్యలు చేపట్టారు. కానీ, టీడీపీ కూటమి ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేసి నిధులు జమకాకుండా అడ్డుకుంది. కోర్టులకు సైతం వెళ్లినా నిధుల విడుదలకు ఆటంకం ఏర్పడింది. టీడీపీ కుట్రల వలన ఆగిన ఈ పథకం నిధులను ఎన్నికల పోలింగ్ పూర్తయిన వెంటనే విడుదల చేస్తామని సీఎం జగన్ బహిరంగ సభలో ప్రకటించారు. ఆ మేరకు రాష్ట్ర ప్రభుత్వం గురువారం నిధులు విడుదల చేసింది. జిల్లాలో 2023–24 విద్యా సంవత్సరంలో మొదటి విడతగా 47,422 మంది విద్యార్థులకు సంబంధించి వారి తల్లులు 42,797 మంది బ్యాంక్ ఖాతాలకు రూ.36.44 కోట్లను ప్రభుత్వం జమ చేసింది. వీరంతా డిగ్రీ, పీజీతో పాటు ఇంజినీరింగ్, మెడిసిన్ తదితర కోర్సులు అభ్యసించే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, ఈబీసీ వర్గాలకు చెందిన విద్యార్థులని జిల్లా షెడ్యూల్డ్ కులాల సంక్షేమం, సాధికారత నోడల్ అధికారి ఎస్. లక్ష్మానాయక్ తెలిపారు.

సంక్షేమ శాఖల వారీగా విడుదలైన నిధులు...

సంక్షేమశాఖ	విద్యార్థుల సంఖ్య	విద్యార్థుల తల్లుల సంఖ్య	విడుదలైన నిధులు (రూ.లో)
ఎస్సీ	12,460	11,196	8,54,04,869
ఎస్టీ	1,107	1,009	75,24,724
బీసీ	15,774	14,297	11,38,71,905
ఈబీసీ	12,250	10,985	11,40,52,489
ముస్లిం	3,006	2,725	2,10,41,998
కాపు	2,768	2,534	2,20,06,142
క్రిస్టియన్	57	51	5,27,624
మొత్తం	47,422	42,797	36,44,29,757

నియోజకవర్గాల వారీగా నిధుల విడుదల ఇలా...

నియోజకవర్గం	విద్యార్థుల సంఖ్య	విద్యార్థుల తల్లుల సంఖ్య	విడుదలైన నిధులు (రూ.లో)
దర్శి	6,247	5,657	1,21,52,075
గిద్దలూరు	6,049	5,498	1,57,65,392
కనిగిరి	6,223	5,586	1,52,87,210
కొండపి	6,482	5,847	1,51,32,550
మార్కాపురం	5,357	4,861	1,19,11,323
ఒంగోలు	6,387	5,691	1,85,79,073
ఎస్.ఎన్.పాడు	5,288	4,731	1,31,07,315
వై.పాలెం	5,389	4,926	1,19,36,967
మొత్తం	47,422	42,797	36,44,29,751

డెంగీపై ప్రజలకు అవగాహన కల్పించాలి



డెంగీ నివారణపై టాస్క్‌ఫోర్స్ సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్

- కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు టౌన్: డెంగీ వ్యాధి నివారణపై ప్రజలకు అవగాహన కల్పించాలని కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ అధికారులు, సిబ్బందిని ఆదేశించారు. జాతీయ డెంగీ నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం స్థానిక కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో జిల్లా టాస్క్‌ఫోర్స్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సమాజ భాగస్వామ్యంతో డెంగీ వ్యాధిని నివారించేందుకు సమర్థవంతంగా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లాలోని అన్ని గ్రామాల్లో మంచినీటి ట్యాంకులను శుభ్రం చేయాలని, ప్రతి శుక్రవారం డ్రై డే పాటించాలని చెప్పారు. ప్రతి ఏడాది దర్శి ప్రాంతంలో డెంగీ వ్యాధి ఎక్కువగా ప్రబలుతున్నందున దానికి కారణాలను అన్వేషించి పరిష్కార చర్యలు చేపట్టాలని చెప్పారు. పంచాయతీ శాఖ, పశుసంవర్ధకశాఖ, వైద్యారోగ్య శాఖలు సమన్వయంతో పనిచేయాలన్నారు. వెక్టార్ వెబ్ కంట్రోల్ యాప్ పెండింగ్ లేకుండా చూడాలని జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి సురేష్, మున్సిపల్ కమిషనర్ జస్వంతరావులకు సూచించారు. ప్రభుత్వ శాఖలన్నీ సమన్వయంతో యాంటీ లార్వా ఆపరేషన్‌ను విజయవంతంగా నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. శాఖల వారీగా డెంగీ నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. సమావేశంలో జెడ్పీ సీఈఓ, డీపీఓ, వైద్య విధాన పరిషత్, వైద్యారోగ్య శాఖ, ఐసీడీఎస్, డీఆర్‌డీఏ, ఎస్సీ, రూరల్ వాటర్ సప్లయ్, విద్యాశాఖ, డీడీ మైన్స్, ట్రైబల్ వెల్ఫేర్ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

గర్భిణుల ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలి

- డీఎంహెచ్‌ఓ డాక్టర్ సురేష్‌కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ సురేష్ కుమార్

ఒంగోలు టౌన్: గర్భిణుల ఆరోగ్యంపై మరింత శ్రద్ధ చూపాలని జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి డాక్టర్ కె.సురేష్ కుమార్ ఆదేశించారు. గురువారం జిల్లా కార్యాలయంలో వైద్యారోగ్య శాఖలోని వివిధ విభాగాల అధికారులు, సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్య కార్యకర్తలు వారి పరిధిలోని గర్భిణుల వివరాలను సకాలంలో రిజిస్టర్ చేయాలని, సమగ్ర వివరాలతో ఆర్‌సీహెచ్ పోర్టల్‌లో అప్లోడ్ చేయాలని సూచించారు. ప్రసవం నుంచి ప్రసవానంతరం వరకు అన్ని రకాల సేవలను క్రమం తప్పకుండా అందజేయాలని చెప్పారు. గర్భిణులకు అందించిన సేవల వివరాలను వెబ్ పోర్టల్‌లో నమోదు చేయాలని, ప్రతి ఒక్కరికీ ఎంసీపీ కార్డ్ అందజేయాలని చెప్పారు. గర్భిణులకు అందించే వైద్య సేవలను సంబంధిత అధికారులు పర్యవేక్షించాలని, తగిన సూచనలు, సలహాలు ఇవ్వాలని ఆదేశించారు. విధుల నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే శాఖాపరంగా కఠినంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆర్‌సీహెచ్, చైల్డ్ హెల్త్, ఇమ్యూనైజేషన్, జాతీయ ఆరోగ్య కార్యక్రమాలన్నింటిలో నిర్దేశించిన లక్ష్యాలను పూర్తి చేయాలని, లక్ష్యాలు సాధించలేని సిబ్బందిపై తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. సమావేశంలో ఒంగోలు ఉప వైద్యాధికారి డాక్టర్ మాధవీలత, డీపీఎంఓ డాక్టర్ వాణిశ్రీ, డీపీహెచ్‌ఎన్‌ఓ సుగుణమ్మ, డీపీఓ సుబ్బలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఏపీఈఏపీసెట్



ఒంగోలులో పరీక్షకు హాజరవుతున్న విద్యార్థులు

ఒంగోలు సెంట్రల్: ఇంజినీరింగ్, వ్యవసాయ, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశానికి గురువారం నిర్వహించిన ఏపీఈఏపీసెట్ (ఇంజినీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ ఎంట్రెన్స్ టెస్ట్) ప్రశాంతంగా ముగిసింది. ఒంగోలులోని రెండు కేంద్రాల్లో 940 మంది విద్యార్థులకుగానూ 870 మంది హాజరై పరీక్ష రాశారు. ఆయా కేంద్రాల వద్ద ముందస్తుగా విద్యార్థులను తనిఖీ చేసి పరీక్షకు అనుమతిచ్చారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు మొదటి విడత, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు రెండో విడత ఎంట్రెన్స్ పరీక్షల్లో విద్యార్థులు పాల్గొన్నారు. ఆయా కేంద్రాల వద్ద పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పించారు.





కూల్.. కూల్..!

మండు వేసవిలో మంచి వర్షం కురిసింది. గురువారం ఉదయం 8.30 నుంచి 10.30 వరకూ రెండు గంటలకుపైగా దంచికొట్టింది. ఒంగోలు నగరం, చుట్టుపక్కల ప్రాంతాల్లో ఏకధాటిగా కురిసిన వర్షానికి రోడ్లన్నీ జలమయమయ్యాయి. వాతావరణం ఒక్కసారిగా వర్షాకాలాన్ని తలపించింది. రోడ్లపై వర్షం నీరు పొంగిపొర్లి వాహనదారులు కొద్దిసేపు అవస్థపడ్డారు. వర్షం వెలిసిన గంట తర్వాత నీళ్లన్నీ కాలువల ద్వారా జారుకోవడంతో ప్రశాంతంగా రాకపోకలు సాగించారు. వర్షానికి సూర్యుడు మొహం చాటేసి వాతావరణం చల్లబడినప్పటికీ.. తీవ్రస్థాయిలో ఉక్కపోతతో ప్రజలు ఉక్కిరిబిక్కిరయ్యారు. చెమటలతో తడిసిముద్దయ్యారు. ఏదిఏమైనప్పటికీ మండుటెండల సమయంలో భారీ వర్షంతో ఊరట చెందారు.

– ఒంగోలు రూరల్





కలెక్టర్‌తో జీజీహెచ్ సూపరింటెండెంట్ భేటీ


కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న జీజీహెచ్ సూపరింటెండెంట్ దుర్గాదేవి

ఒంగోలు టౌన్: ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి సూపరింటెండెంట్‌గా ఇటీవల బాధ్యతలు చేపట్టిన డాక్టర్ దుర్గాదేవి గురువారం కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆమెను కలెక్టర్ అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. జీజీహెచ్‌లో చికిత్స కోసం వచ్చే ప్రజలకు మెరుగైన వైద్య సేవలను అందించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆరోగ్య శ్రీ సేవలు గణనీయంగా పెంచేందుకు ప్రణాళికాబద్ధంగా వ్యవహరించాలని చెప్పారు. సూపర్ స్పెషాలిటీ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకునేలా ప్రోత్సహించాలన్నారు.

తెలుగు తమ్ముళ్ల శవ రాజకీయం!

- అయ్యపురాజుపాలెంలో వృద్ధుడు మృతి
- ఆస్తి పంచాయితీ తేలేవరకు అంత్యక్రియలొద్దని మంకుపట్టు


మృతదేహాన్ని మంచంపై తీసుకెళ్తున్న కుమార్తెలు

మద్దిపాడు: మండలంలోని అయ్యపురాజుపాలెంలో తెలుగుతమ్ముళ్లు శవరాజకీయం చేశారు. రెండు రోజుల క్రితం మరణించిన వృద్ధుడిని ఖననం చేయనివ్వకుండా రెండు కుటుంబాల మధ్య చిచ్చుపెట్టి ఆస్తి పేరిట తెలుగు తమ్ముళ్లు కుటిల రాజకీయం చేశారు. మృతుడి బంధువుల కథనం ప్రకారం.. మండలంలోని అయ్యపురాజుపాలెం గ్రామానికి చెందిన గుట్లపల్లి వెంకటేశ్వర్లు(72)కు ఆదే గ్రామానికి చెందిన రమణమ్మతో సుమారు 40 ఏళ్ల క్రితం వివాహమైంది. వివాహం అయిన కొద్దిరోజులకే భార్యాభర్తల మధ్య సంబంధం తెగిపోయింది. భర్తను వీడి భార్య రమణమ్మ మరో ప్రాంతానికి వెళ్లిపోయింది. ఒంటరి అయిన గుంట్లపల్లి వెంకటేశ్వర్లు తన అన్న వెంకయ్య వద్దే ఉంటున్నాడు. చేరదీశారన్న కృతజ్ఞతతో తన పేరిట ఉన్న నాలుగు ఎకరాల భూమిని అన్న కుమారులకు వెంకటేశ్వర్లు రిజిస్ట్రేషన్ చేశారు. విషయం తెలుసుకున్న రమణమ్మ ముగ్గురు కుమార్తెలు తరచూ అయ్యపురాజుపాలెం గ్రామానికి చేరుకుని టీడీపీ నేతల సహకారంతో గొడవకు దిగారు. ఈ క్రమంలో గుట్లపల్లి వెంకటేశ్వర్లు ఈ నెల 15న ఉదయం తన అన్న కొష్టంలో మరణించాడు. అన్న వెంకయ్య కుమారులు అంత్యక్రియలు చేయడానికి ఏర్పాట్లు చేస్తుండగా రమణమ్మ, ఆమె ముగ్గురు కుమార్తెలు అయ్యపురాజుపాలెం చేరుకుని అంత్యక్రియలను అడ్డుకున్నారు. వృద్ధుడు మృతి చెంది రెండు రోజులు కావడంతో దుర్వాసన వస్తోంది. మృతదేహం ఉన్న మంచాన్ని వెంకయ్య కుమారుల ఇంటి వద్దకు తీసుకెళ్లి ఆస్తి ఇస్తేనే అంత్యక్రియలు చేయనిస్తాం, లేదంటే శవం పూర్తిగా కుళ్లిపోయేవరకు ఇక్కడే ఉంటుందని భీష్మించారు. లేదా శవాన్ని మేమే ఖననం చేస్తాం.. మూడు నెలలు పాటూ ఈ ఇంట్లోనే ఉండనివ్వండి అని డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న స్థానిక ఎస్సై శివబసవరాజు సంఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. ఇరువర్గాలకు సర్దిచెప్పి మృతదేహానికి అంత్యక్రియలు పూర్తి చేయించారు.

అడవిలో ఆర్తనాదాలు..!

- ప్లాస్టిక్ ఫ్రీ జోన్ పేరిట అటవీశాఖ అధికారుల అత్యుత్సాహం
- శ్రీశైలం యాత్రికుల నుంచి తాగునీటి బాటిళ్లు స్వాధీనం
- విస్తృతంగా అవగాహన కల్పించకుండానే ఆంక్షలపై భక్తుల ఆగ్రహం
- కొర్రప్రోలు చెక్‌పోస్టు వద్ద లేని రూల్స్ శ్రీశైలం చెక్‌పోస్టు వద్దే ఎందుకని మండిపాటు

పెద్దదోర్నాల: పర్యావరణ పరిరక్షణ, వన్యప్రాణుల సంరక్షణకు అటవీశాఖ తీసుకుంటున్న కొన్ని నిర్ణయాలు సత్ఫలితాలు ఇస్తున్నాయి. అయితే కొందరు అధికారుల దుందుడుకు నిర్ణయాలు శ్రీశైలం వెళ్లే యాత్రికులు, భక్తులను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నాయి. గత కొద్ది రోజులుగా శ్రీశైల పుణ్యక్షేత్రానికి వెళ్తున్న యాత్రికుల నుంచి ప్లాస్టిక్ నీటి బాటిళ్ల(నిండువి)ను గణపతి చెక్ పోస్టు వద్ద బలవంతంగా స్వాధీనం చేసుకోవడంపై ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్నాయి. 42 నుంచి 44 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు ఉన్న నేటి తరుణంలో ప్లాస్టిక్ ఫ్రీజోన్‌ను బూచిగా చూపిస్తూ నీటి బాటిళ్లను పెద్దదోర్నాల చెక్‌పోస్టు వద్దే స్వాధీనం చేసుకోవడంపై భక్తులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు.

అవగాహన కల్పించారా?

ప్లాస్టిక్ బాటిళ్లతో పర్యావరణానికి ముప్పు వాటిల్లుతుండడంలో ఎలాంటి సందేహం లేదు. కానీ ప్లాస్టిక్ సీసాలను అభయారణ్యంలో నిషేధిస్తున్నట్లు ముందుగానే సామాజిక మాధ్యమాల ద్వారా విస్తృతంగా ప్రచారం చేసి ప్రజలకు అవగాహన కల్పించేందుకు అటవీ శాఖ ఎలాంటి చర్యలు చేపట్టలేదు. పెద్దదోర్నాల మండల కేంద్రం నుంచి శ్రీశైలం పుణ్యక్షేత్రానికి 50 కిలోమీటర్ల దూరం ప్రయాణించాల్సి ఉంటుంది. అందుకు సుమారుగా గంటన్నర సమయం పడుతుంది. ఉన్నట్టుండి కఠిన ఆంక్షలు అమలు చేయడం వల్ల మార్గమధ్యంలో దాహం వేస్తే తాము ఏమి చేయాలన్న భక్తుల ప్రశ్నకు అధికారుల వద్ద సమాధానం లేదు. అభయారణ్యంలో తాగునీటికి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయకుండా ఏకపక్షంగా ప్లాస్టిక్ సీసాలను నిషేధించడం సరికాదని అభిప్రాయపడుతున్నారు.


గణపతి చెక్‌పోస్ట్ వద్ద భక్తుల నుంచి ప్లాస్టిక్ బాటిళ్లు స్వాధీనం చేసుకుంటున్న సిబ్బంది

కొర్రప్రోలులో ఒకలా.. గణపతి చెక్‌పోస్టులో మరోలా..

అభయారణ్యాన్ని ప్లాస్టిక్ ఫ్రీ జోన్‌గా ప్రకటిస్తే కొర్రప్రోలు చెక్‌పోస్టు వద్ద కర్నూలు వెళ్లే ప్రయాణికుల నుంచి ప్లాస్టిక్ బాటిళ్లను స్వాధీనం చేసుకోవాలి. కానీ కేవలం గణపతి చెక్‌పోస్టు వద్దే స్వాధీనం చేసుకోవడంలో ఆంతర్యమేమిటని భక్తులు ప్రశ్నిస్తున్నారు. గత కొన్నేళ్లుగా నల్లమల అభయారణ్యంలో రోడ్డు వెంట ప్లాస్టిక్ బాటిళ్లను ఏరివేసేందుకు కొంత మంది స్వచ్ఛసేవక్‌లను నియమించారు. వారిని అలాగే కొనసాగిస్తూ, అభయారణ్యంలో తాగునీటికి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసి, ప్లాస్టిక్ బాటిళ్లను పూర్తిగా నిషేధిస్తే బాగుండేదని భక్తులు అభిప్రాయపడుతున్నారు. తాగునీటికి ప్రత్యామ్నాయం చూపే వరకు కఠిన ఆంక్షలు నిలిపేయాలని కోరుతున్నారు. భక్తుల నీటి అవస్థలపై అటవీశాఖ రేంజ్ అధికారి విశ్వేశ్వరరావును వివరణ కోరగా.. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకే ప్లాస్టిక్ బాటిళ్లను స్వాధీనం చేసుకుంటున్నామని ముక్తాయించారు.



చెక్ పోస్టు వద్ద గుట్టగా పడిన తాగునీటి సీసాలు

పర్యావరణ రక్షణ అందరి బాధ్యత

- ట్రైనీ ఐఎఫ్ఎస్ శివకుమార్ హంగల్


ఘాట్ రోడ్డులో వాహనాన్ని పరిశీలిస్తున్న ట్రైనీ ఐఎఫ్ఎస్ శివకుమార్ హంగల్

పెద్దదోర్నాల: పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని ట్రైనీ ఐఎఫ్ఎస్ శివకుమార్ హంగల్ పేర్కొన్నారు. గురువారం శ్రీశైలం రహదారిలో ప్లాస్టిక్ వినియోగంపై వాహనదారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సుదూర ప్రాంతాల నుంచి శ్రీశైలం వచ్చే భక్తులు, యాత్రికులు శ్రీశైలం వెళ్లే క్రమంలో మార్గమధ్యంలో ఉన్న పెద్దదోర్నాలలో నీటి బాటిళ్లు, ప్లాస్టిక్ కవర్లలో ప్యాక్ చేసిన తినుబండారాలు సర్వ సాధారణంగా కొనుగోలు చేస్తుంటారన్నారు. అయితే రుచి చూసిన ఆహార పదార్థాల వ్యర్థాలను మార్గ మధ్యంలో అభయారణ్యంలో పడేయడం వల్ల వాటిని వన్యప్రాణులు ఆత్రంగా తిని ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉందని చెప్పారు. ఈ నేపథ్యంలో ప్రయాణికులు, యాత్రికులు వదిలి వెళ్లిన ప్లాస్టిక్ వ్యర్థాలను స్వచ్ఛ సేవక్‌ల సాయంతో సేకరించి, రీసైక్లింగ్ చేసి పునర్వినియోగించేలా చర్యలు చేపట్టామని వివరించారు. నల్లమలలోని బేస్ క్యాంపులను పరిశీలించి, సిబ్బందికి పలు సూచనలు చేశారు.

శ్రీశైలం ఘాట్‌లో రోడ్డు ప్రమాదం

- అదుపు తప్పి లోయలోకి దూసుకెళ్లిన కారు
- సుమారు 15 మందికి తీవ్ర గాయాలు
- క్షతగాత్రులది కర్నూలు జిల్లా ప్యాలకుర్తి


లోయలో బోల్తా పడిన వాహనం


ప్రమాదంలో గాయపడిన ప్రయాణికులు

పెద్దదోర్నాల: మల్లన్న దర్శనానికి వెళ్తుండగా కారు అదుపు తప్పి లోయలో బోల్తా పడిన ఘటన గురువారం చిన్నారుట్ల సమీపంలోని దయ్యాల మలుపు వద్ద చోటుచేసుకుంది. ప్రమాదంలో 15 మందికి తీవ్ర గాయాలయ్యాయి. ఎస్సై అంకమ్మరావు కథనం మేరకు.. కర్నూలు జిల్లా కోడుమూరు మండలం ప్యాలకుర్తికి చెందిన ఉమ్మడి కుటుంబ సభ్యులు దైవదర్శనం నిమిత్తం కారులో శ్రీశైలం వెళ్తున్నారు. ఈ క్రమంలో ఘాట్ రోడ్డులో కారు అదుపు తప్పి లోయలోకి దూసుకెళ్లి బోల్తా కొట్టింది. ప్రమాదంలో ప్రేమ్‌కుమార్, నగేష్, వెంకట్రాముడు, రమేష్, కేశవులు, మనోహర్, సురేష్, కుమార్‌తోసహా 15 మంది తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం అందుకున్న శ్రీశైలం, పెద్దదోర్నాల 108 వాహనాల సిబ్బంది హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను శ్రీశైలం ప్రాజెక్టు కాలనీలోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించేందుకు శ్రీశైలం పోలీసు సిబ్బందితో కలిసి ఎస్సై అంకమరావు చర్యలు చేపట్టారు. సంఘటనా స్థలాన్ని ఎస్సై పరిశీలించి ప్రమాదానికి గల కారణాలు తెలుసుకున్నారు. తీవ్రంగా గాయపడిన వారికి మెరుగైన వైద్యం కోసం కర్నూలు తరలించారు. మితిమీరిన వేగమే ప్రమాదానికి కారణమని పోలీసులు భావిస్తున్నారు.

టమోటా లారీ బోల్తా

- డ్రైవర్‌కు స్వల్ప గాయాలు


రోడ్డు మార్జిన్‌లో బోల్తా పడిన లారీ

కొమరోలు: వేగంగా వెళ్తున్న లారీ అదుపుతప్పి రహదారి పక్కన పొలంలో బోల్తా పడింది. ఈ సంఘటన గురువారం తెల్లవారుజామున కొమరోలు మండలంలోని బ్రాహ్మణపల్లె గ్రామ సమీపంలో కడప-అమరావతి రాష్ట్రీయ రహదారిపై చోటుచేసుకుంది. మదనపల్లి నుంచి గుంటూరుకు టమోటా లోడుతో వెళ్తున్న లారీ అతి వేగంతో వెళ్తున్న క్రమంలో అదుపు తప్పడంతో డ్రైవర్ సుధాకర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. లారీ బోల్తా పడటంతో టమోటాలు ఛిద్రమయ్యాయి.

కష్టించి పనిచేసిన వారిని
గుండెల్లో పెట్టుకుంటా

- దద్దాల నారాయణ యాదవ్


మేకల బాలును పరామర్శిస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి దద్దాల నారాయణ

సీఎస్‌పురం(పామూరు): వైఎస్సార్ సీపీ బలోపేతం, ఎన్నికల్లో పార్టీ విజయానికి పనిచేసిన పార్టీ నాయకులు, కార్యకర్తలను గుండెల్లో పెట్టుకుని చూసుకుంటానని వైఎస్సార్ సీపీ కనిగిరి ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ దద్దాల నారాయణయాదవ్ అన్నారు. ఈ నెల 13న సీఎస్‌పురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 84వ పోలింగ్‌బూత్‌లో టీడీపీ ఏజెంట్ల దురాగతాలను వైఎస్సార్ సీపీకి చెందిన టీయూసీ జిల్లా అధ్యక్షుడు మేకల బాలు యాదవ్ ప్రశ్నించాడు. దీంతో ఆగ్రహించిన టీడీపీ వారు పెద్ద సంఖ్యలో మేకల బాలు యాద్‌పై దాడిచేసి గాయపరిచారు. దీంతో బుధవారం రాత్రి డాక్టర్ దద్దాల నారాయణ యాదవ్ మేకల బాలు స్వగ్రామం కొండబోయినపల్లిలోని ఆయన నివాసానికి వెళ్లి దాడి ఘటనపై వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా దద్దాల మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ ఘోరపరాభవం కనిగిరితో పాటు అటు రాష్ట్రంలోను చవిచూడబోతోందని దీంతో టీడీపీ శ్రేణులు ఏం చేయాలో దిక్కుతోచక ఇతర పార్టీల వారిపై దాడులకు దిగుతున్నారన్నారు. పార్టీ అన్ని విధాలా అండగా ఉంటుందని, దాడికి పాల్పడ్డ వారికి కఠిన శిక్ష పడేలా చూస్తామని, మరోమారు ఇలా జరగకుండా తగు జాగ్రత్తలు తీసుకునేలా చూస్తాన్నారు. ఆయన వెంట పీడీసీసీబీ చైర్మన్ వైఎం.ప్రసాద్‌రెడ్డి, జెడ్పీటీసీల సంఘ జిల్లా అధ్యక్షుడు, వెలిగండ్ల జెడ్పీటీసీ గుంటక తిరుపతిరెడ్డి, మండల జేఏసీ కన్వీనర్ బైరెడ్డి తిరుపతిరెడ్డి, పార్టీ యూత్ మండల అధ్యక్షుడు బొర్రాజు రమణయ్యయాదవ్, బొట్లా చిరంజీవి, ఇర్లా వీరాంజనేయులు, బత్తుల మాల్యాద్రి, పలువురు నాయకులు ఉన్నారు.

కనిగిరి టీడీపీలో కలవరం

- కనిగిరిలో 29 బూత్‌ల్లో మహిళల ఓట్లే అత్యధికం
- 5 బూత్‌ల్లో మాత్రమే పురుషుల ఓట్లు ఎక్కువ
- పురుషుల కంటే అధికంగా ఓటేసిన 763 మంది మహిళలు
- మహిళలు, మైనారిటీల ఓట్లు తమవే అంటున్న వైఎస్సార్ సీపీ


ఓటు హక్కు వినియోగించుకుంటున్న మహిళలు (ఫైల్)

కనిగిరి రూరల్: సార్వత్రిక ఎన్నికల్లో కనిగిరి పట్టణంలో మహిళల ఓట్లే అత్యధికంగా పోలయ్యాయి. కనిగిరి మున్సిపాలిటీలోని 20 వార్డుల్లో 34,281 ఓట్లు ఉండగా 27,712 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. మున్సిపాలిటీ పరిధిలో 34 పోలింగ్ బూత్‌లు ఉండగా 29 బూత్‌ల్లో పురుషుల కంటే ఎక్కువగా మహిళలే ఓటు వేశారు. 5 బూత్‌లలో(132, 142, 143, 152, 168) మాత్రమే మహిళలకంటే పురుషులు ఎక్కువ శాతం ఓటు హక్కును వినియోగించుకున్నారు. పట్టణంలోని 34 బూత్‌ల్లో పురుషులు 13,119 మంది, మహిళలు 13,882 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. పురుషుల కంటే మహిళలు 763 మంది ఎక్కువగా ఓటు వేశారు.

మహిళల ఓటింగ్‌పై టీడీపీలో ఆందోళన

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన సంక్షేమ పథకాలు ప్రతి ఇంటికీ చేరాయి. అందులో ప్రతి పథకంలో మహిళలకే అధిక ప్రాధాన్యత ఇచ్చారు. ప్రతి ఇంట్లో రూ లక్ష నుంచి రూ.20 లక్షల వరకు లబ్ధి చేకూరింది. దీంతో ఎక్కువ మంది మహిళల ఓట్లు వైఎస్సార్ సీపీ వైపే మొగ్గు చూపే అవకాశం ఉందని అంచనా. అంతేగాక ముస్లిం మైనార్టీల ఓట్లు అధికంగా నియోజకవర్గంలో సుమారు 22 వేలు ఉండగా, అందులో కనిగిరి పట్టణంలోనే 14 వేల మంది ఉన్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అధికారంలోకి వస్తే ముస్లింల 4 శాతం రిజర్వేషన్ రద్దు చేస్తారని ముస్లింలు బలంగా నమ్మారు. దీంతో టీడీపీ అభిమానుల్లోని ముస్లిం ఓటర్లు సైతం పోలింగ్ కేంద్రాల్లో ఉత్సాహంగా కనిపించలేదు. కొన్ని చోట్ల క్రాస్ ఓటింగ్‌కు పాల్పడ్డారని వాదనలు కూడా ప్రచారంలో ఉన్నాయి. ఏది ఏమైనా పట్టణంలో మహిళల ఓటింగ్ శాతం పెరగడం, అంతేగాక ముస్లిం సామాజిక వర్గం అత్యధికంగా ఉండే (119, 120, 121, 122, 126, 129, 140, 141, 143, 144, 149, 151) బూత్‌ల్లో, ఎస్సీ సామాజిక వర్గం ఎక్కువగా ఉండే 123, 132,133,150, 152 బూత్‌ల్లో కూడా దాదాపు మహిళలే ఎక్కువ శాతం ఓటు వేశారు. దీంతో ఆయా సామాజికవర్గాల ఓట్లు ఎక్కువ శాతం వైఎస్సార్ సీపీకే అనుకూలంగా ఉంటాయనేది విశ్లేషకులు అంచనా. అంతేగాక మరో సామాజికవర్గం ఓట్లపై పూర్తిగా క్లారిటీ లేకపోవడంతో టీడీపీ నేతల్లో ఆందోళన నెలకొంది.